# నేటి నుంచే నామినేషన్ల స్వీకరణ

- అన్ని రకాల ఏర్పాట్లను సిద్ధం చేశాం..
- రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు వెల్లడి
- అభ్యర్థితో ఐదుగురికి మాత్రమే ఆర్‌వో కార్యాలయంలోకి అనుమతి
- జనరల్ అభ్యర్థికి రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థికి రూ.5000 డిపాజిట్లు



నర్సాపూర్‌లో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు

నర్సాపూర్, నవంబర్ 2: అసెంబ్లీ సాధారణ ఎన్నికల నేపథ్యంలో నేటి నుంచి స్వీకరించనున్న నామినేషన్ల ప్రక్రియకు నర్సాపూర్ ఆర్‌వో కార్యాలయం వద్ద అన్ని రకాల ఏర్పాట్లను సిద్ధం చేశామని రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు వెల్లడించారు. గురువారం ఆర్‌వో కార్యాలయంలో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలను తీసుకున్నామని తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,21,972 ఉండగా, అందులో మహిళలు 1,13,551 మంది, పురుషులు 1,08,414 మంది, థర్డ్ జెండర్స్ ఏడుగురు ఉన్నారని వెల్లడించారు. ఇందులో పీడబ్ల్యూడీ 4,531, 80 ఏండ్లు దాటిన వారు 1,716, యువ ఓటర్లు 8,104 మంది ఉన్నారని తెలిపారు. నామినేషన్ నోటిఫికేషన్ (నేడు) ఈ నెల 3వ తేదీ నుంచి మొదలై 10వ తేదీన వరకు, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని వెల్లడించారు. అభ్యర్థి నామినేషన్‌లో అఫిడవిట్‌లో ఫామ్ 26, ఫామ్ ఏబీ నింపాలని, ఒక అభ్యర్థి 4 సెట్ల నామినేషన్లు వేయాలని, అభ్యర్థి డిపాజిట్ ఫీజు జనరల్ అభ్యర్థికి రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థికి రూ.5000గా ఈసీఐ (కేంద్ర ఎన్నికల సంఘం) నిర్ధారించిందని వెల్లడించారు. నామినేషన్లకు వచ్చేవారు అభ్యర్థితో ఐదుగురికి మాత్రమే ఆర్‌వో కార్యాలయంలో అనుమతి ఉంటుందని, వాహనాలు కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో నిలపాలని, పోటీ చేసే అభ్యర్థి వివరాలు కేవైసీ యాప్ ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు కమలాద్రి తదితరులు పాల్గొన్నారు.


రామాయంపేట: మాట్లాడుతున్న యాదగిరి, కమిటీ సభ్యులు

## మున్నూరు కాపులు బీఆర్‌ఎస్ పక్షమే

- రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పేట కౌన్సిలర్ యాదగిరి

రామాయంపేట, నవంబర్ 2: రాష్ట్రంలోని మున్నూరు కాపులంతా సీఎం కేసీఆర్ పక్షమే ఉంటారని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేమె యాదగిరి స్పష్టంచేశారు. గురువారం రామాయంపేటలోని మున్నూరు కాపు సంఘం 4వ బేడకు నూతన కమిటీని ఎంపిక చేసి మాట్లాడారు. తెలంగాణలో ఎక్కడ ఎన్నికలు జరిగినా మున్నూరుకాపులు బీఆర్‌ఎస్ పక్షమే ఉన్నారని, ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో కూడా మున్నూరు కాపులు అంతా బీఆర్‌ఎస్ అభ్యర్థులకే ఓటేస్తారన్నారు. రామాయంపేటలో నూతనంగా జరిగిన నాల్గో బేడా అధ్యక్షుడిగా బీర రాంచంద్రం, ఉపాధ్యక్షుడిగా కస్తూరి శేఖర్, కార్యదర్శిగా బాలనాగరాజు, సహాయ కార్యదర్శిగా బీర భిక్షపతి, కోశాధికారిగా బీర రాము, ఆడిటర్‌గా మల్లేశం, సలహాదారులుగా ముత్తయ్య, వెంకటేశం, చిన్నరాజయ్య, బీర మల్లేశం, గాజుల రాజు, బీర స్వామి, కస్తూరి రమేశ్, బీర యాదయ్య ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

## రన్నింగ్‌లో శ్రీహాసినికి ప్రథమ బహుమతి



విద్యార్థిని శ్రీహాసిని

నిజాంపేట, నవంబర్ 2: హైదరాబాద్‌లోని నిజాం కాలేజీలో దేవేందర్‌యాదవ్ 35వ మెమోరియల్ రన్-2023 అండర్-15 విభాగంలో 2 కిలోమీటర్ల రన్నింగ్ పోటీలను గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో నస్కల్ గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని దేశెట్టి శ్రీహాసిని ప్రథమ బహుమతి సాధించింది. ఎంపీపీ సిద్ధిరాములు విద్యార్థి శ్రీహాసినిని అభినందించారు. యువత చదువుతో పాటు ఆటల్లో రాణించాలని, క్రీడాకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎంపీపీ హామీ ఇచ్చారు.


నర్సాపూర్: పట్టణ కార్యకర్తల సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

## సునీతారెడ్డి విజయానికి కృషి చేద్దాం

- బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి పిలుపు

నర్సాపూర్, నవంబర్ 2: బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతా లక్ష్మారెడ్డి విజయానికి కార్యకర్తలు శాయశక్తుల కృషి చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పంబల భిక్షపతి పిలుపునిచ్చారు. గురువారం నర్సాపూర్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం భిక్షపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ మున్సిపాలిటీలోని ప్రతి వార్డుకు 10 మందితో కూడిన కమిటీలను ఏర్పాటు చేశామని, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోను పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పనులే పార్టీ విజయానికి కారణమవుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్‌ఎస్ యువనాయకుడు వాకిటి శశిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, కౌన్సిలర్ రాంచందర్, బీఆర్‌ఎస్ నాయకులు సత్యంగౌడ్, రాజేశ్, జగదీశ్, నగేశ్, ఆంజనేయులుగౌడ్, తొంట వెంకట్, షేక్ హుస్సేన్, సాగర్, కృపాచారి, రాకేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులకు విలువిద్యను నేర్పిస్తున్న బొంతల సత్యనారాయణ

## విలు విద్యలో ఉచిత శిక్షణ

- హాకీ అసోషియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ

రామాయంపేట, నవంబర్ 2: చిన్నారులు విలు విద్యను అలవర్చుకోవాలని జిల్లా హాకీ అసోషియేషన్ ఉపాధ్యక్షుడు బొంతల సత్యనారాయణ సూచించారు. గురువారం రామాయంపేట కళాశాల గ్రౌండ్‌లో చిన్నారులకు విలు విద్యను నేర్పిస్తున్నామని, చిన్నారులతో పాటు యువకులు కూడా నేర్చుకోవాలన్నారు. మన రాష్ట్రంలోనే కాదు, ఏ రాష్ట్రంలో కూడా విలు విద్యను నేర్పేవారు లేరని, తాను ఉచితంగా ఈ విద్యను నేర్పుతున్నానని అన్నారు. ఉదయం 6 గంటల నుంచి 8 వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 7 వరకు ఈ ఉచిత విలు విద్యలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ విలు విద్యను నేర్చుకునే వారు వెంటనే తమను కళాశాల గ్రౌండ్‌లో కలవాలని, ఉచితంగానే నేర్పిస్తున్నట్లు సత్యనారాయణ వెల్లడించారు.


వెల్దుర్తి మండల కుమ్మరి సంఘం కార్యవర్గంతో నాయకులు

## కుమ్మరులకు అన్నింటా ప్రాధాన్యతనివ్వాలి

వెల్దుర్తి, నవంబర్ 2: కుమ్మరులకు అన్ని రంగాల్లో ప్రాధాన్యతను ఇవ్వాలని, అవకాశాలను కల్పించాలని నర్సాపూర్ నియోజకవర్గ కుమ్మరి సంఘం అధ్యక్షుడు శంకరయ్య కోరారు. వెల్దుర్తి మండల కుమ్మరి కులస్తుల నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడు బాలేశ్, ప్రధాన కార్యదర్శి సురేశ్ ఆధ్వర్యంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సంఘం అధ్యక్షుడిగా శెట్‌పల్లికి చెందిన లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా వెల్దుర్తికి చెందిన ముకుందం, ఉపాధ్యక్షుడిగా రాములు, గౌరవ అధ్యక్షుడిగా శేఖులు, కోశాధికారిగా భిక్షపతితో పాటు మరో 10 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## ఎస్టీయూ సభ్యత్వ నమోదు

రామాయంపేట, నవంబర్ 2: ప్రభుత్వం టీచర్లకు అందించే పాత పీఆర్సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మెంగర్తి ప్రణీద్‌కుమార్ అన్నారు. గురువారం రామాయంపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో ఎస్టీయూ సభ్యత్వాన్ని నిర్వహించి సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రామాయంపేట మండల అధ్యక్షుడు ఐరేని రవీందర్‌గౌడ్, నర్సింహ్మారావు, రసీద్, నాగేందర్, కిషన్, శ్యాంసుందర్ తదితరులు ఉన్నారు.


తూప్రాన్ సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో వెల్దుర్తిలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

## ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిస్తాం

- వెల్దుర్తిలో కేంద్ర బలగాల కవాతు: సీఐ శ్రీధర్

వెల్దుర్తి, నవంబర్ 2: ఈ సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర బలగాలతో గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నట్లు తూప్రాన్ సీఐ శ్రీధర్ తెలిపారు. గురువారం వెల్దుర్తికి వచ్చిన కేంద్ర బలగాలతో పట్టణంలో వెల్దుర్తి ఎస్సై మధుసూదన్‌గౌడ్‌తో కలిసి ప్రధాన రోడ్డుతో పాటు పలు వీధులలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి ఘటనలు జరుగకుండా, ప్రజల్లో చైతన్యం కల్పించి, ప్రశాంత వాతావరణంలో ఓటర్లు స్వచ్ఛందంగా తరలివచ్చి ఓట్లు వేసేలా ఈ కవాతు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా, భయభ్రాంతులకు గురిచేసినా బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కవాతులో వెల్దుర్తి పోలీస్ సిబ్బందితో పాటు 30 మంది కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.


కొల్చారం: చిన్నాఘన్‌పూర్ జడ్పీ హైస్కూల్‌లో మాక్ పోలింగ్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

## నేటి విద్యార్థులే రేపటి ఓటర్లు

- చిన్నాఘన్‌పూర్ జడ్పీ హైస్కూల్‌లో మాక్ పోలింగ్

కొల్చారం, నవంబర్ 2: నేటి విద్యార్థులే రేపటి ఓటర్లు అని, ప్రజాస్వామ్యంలో మంచి నాయకుడిని ఎన్నుకునేందుకు ఓటు వజ్రాయుధమని చిన్నాఘన్‌పూర్ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మంగలి శంకర్, హెడ్‌మాస్టర్ ఎజాజ్ సుల్తానా అన్నారు. మండలంలోని చిన్నాఘన్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ మాక్ పోలింగ్‌లో ఉపాధ్యాయులు సీతారాం, ఎస్.రమణకుమార్, వి.సంగయ్య, సిద్ధిరాములు, ఎం.మహేశ్‌కుమార్, రుక్మేశ్ పాల్గొనగా, ఈ ఎన్నికల్లో అభ్యర్థులుగా అనూష, వికాస్, యోహాన్, ఎన్నికల సిబ్బందిగా శైలజ, దీపిక, విగ్నేశ్, పవిత్ర విధులు నిర్వహించారు.